

# ఎవరు గురువు?

మహర్షి

ఒక వ్యాపారి చాలా శ్రమించి న్యాయంగా సంపాదించి శ్రీమంతుడైనాడు. సంపాదించిన ధనాన్ని సాధ్యమైనంత వరకు దానధర్మాలు చేస్తూ పొదుపుగా సంసారానికి ఖర్చు చేసుకుంటూ హాయిగా బ్రతుకుతున్నాడు. అతనికి చాలా కాలానికి ఓ కుమారుడు కలిగాడు. ఆ కుమారుణ్ణి చాలా గారాబంగా పెంచుతూ, అడిగినంత డబ్బు, అడిగింది లేదనకుండా చూడటం వలన చెడు అలవాట్లు కలిగాయి. చేతినిండా డబ్బులుండటం వలన స్నేహితులు ఎక్కువై జల్సాలు పెరిగిపోయాయి. డబ్బును నీళ్ళవలె ఖర్చు చేస్తున్నాడు.

కొంతకాలానికి శ్రీమంతుని కుమారునికి దురలవాట్లు, దుశ్చింతలు, దుర్బుద్ధులు అధికమై చెడ మార్గం పట్టాడు. ఈ పరిస్థితిని గమనించిన తండ్రి తనలో తనే కుమిలి పోయాడు. కొడుకు ఖర్చు చేయగా మిగిలిన మొత్తం డబ్బు బంగారు నగలు ఒక పాత్రలో పెట్టి, తన కుమారునికి ఎప్పటికైనా పనికి వస్తుందని ఆలోచించి తన ఇంటి ప్రాంగణంలో ఒక గోతిని త్రవ్వి అందులో పూడ్చి పెట్టాడు. ఈ రహస్యమును తన సన్నిహితుడైన ఓ మిత్రునికి చెప్పి తను చనిపోతే తన కుమారునికి ఈ విషయం చెప్పమని చెప్పాడు.

కుమారుని బుద్ధులు మారక పోయేటప్పటికి అతను మనోవ్యాధితో కృంగి పోయాడు. ఒక రోజు అర్ధరాత్రి వేళ అతని పరిస్థితి విషమించింది. తెల్లవార్లూ విపరీతమైన బాధ పడ్డాడు. తెల్లవారిన తరువాత తన కుమారునికి తను దాచిన ధనం గురించి చెప్పాలనుకున్నాడు. తన స్నేహితుడు దాచిన ధనం గురించి చెప్పకపోతే తను పోయిన తరువాత కొడుకు కష్టాలు పడతాడని అతని భయం. తెల్లవారగానే చెబుదామని ఎదురు చూశాడు. కానీ మృత్యు దేవత అతనిని తెల్లవార నీయక ముందే తీసుకుపోయింది.

తండ్రి దాచిన ధనము కొడుక్కి తెలియలేదు. తన దగ్గర వున్నదంతా ఖర్చు పెట్టాడు. ఇక చేతిలో రూపాయి మిగలలేదు.

పొట్టగడవడం కష్టమైనది. ఇక చేసేది లేదనుకుని భిక్షం ఎత్తుకునే స్థితికి వచ్చాడు. ప్రతి ఇల్లు తిరిగి అడుక్కుంటుండగా ఒకరోజు అతని తండ్రి స్నేహితుడు కనిపించి "అరే! ఇదేమిటి నాయనా! నీకు ఇలా అడుక్కుతినే ఖర్మ ఎందుకు?" అని పలుకరించాడు. అప్పుడు శ్రీమంతుని కుమారుడు "నా తండ్రి సంపాదించిన ధనమంతా ఏనాడో ఖర్చు చేసేశాను. నా దగ్గర ఒక్క పైసా కూడా లేదు" అని దీనంగా చెప్పుకున్నాడు. అప్పుడు తండ్రి స్నేహితుడు "మీ నాన్న చెప్పడం మరచిపోయి వుంటాడు. నేనొక విషయం చెబుతాను. ఇక ముందైనా తెలివిగా బుద్ధిగా జీవించాలి" అని చెప్పి అతని ఇంటికెళ్ళి రాత్రికి రాత్రే పెరట్లో దాచిన ధనాన్ని వెలికి తీసి అప్పగించాడు.

ఆత్మతత్వం అనే ధనం సద్గుణము అనే సువర్ణ పాత్రలో దాగివున్నది. ఆ పాత్ర దేహమనే నేలలో పూడ్చబడి ఉంది. అది జీవాత్మకే చెందాలి. కానీ జీవాత్మకి తనలో దాగి వున్న ఆత్మధనం సంగతి తెలియదు. జీవునిలో అతనికే తెలియకుండా ఉన్న ఆత్మతత్వాన్ని ఎరుకపరచి, జ్ఞాన ధనాన్ని అందించే వాడే గురువు.

## అదీ సంగతి

(మినీకథ)

విజయవాడ నుండి విశాఖపట్టణం వెళ్ళే నైట్ సర్వీస్ బస్సు బయలుదేరుతుండగా లేడీస్ సీట్లో కూర్చున్న ఓ ముసలవ్వ "బాబూ! పెద్దాపురం వచ్చాక చెప్పు!" అంది కండక్టరుతో.

"అలాగే అవ్వా!" అంటూ తలూపాడు కండక్టర్.

అరగంట గడిచాక "పెద్దాపురం వచ్చిందా బాబూ!" అడిగిందా ముసలవ్వ.

"ఇంకా చాలా దూరం ఉంది!" అన్నాడు కండక్టర్.

ఇంకో అరగంట గడిచాక మళ్ళీ అడిగింది.

"అబ్బ! పెద్దాపురం వచ్చాక లేపుతా కాని నస పెట్టక పడుకో!" విసుక్కున్నాడు.

అప్పటికే చాలా మంది నిద్రలోకి జారుకున్నారు. నిద్రపట్టని ఒకరిద్దరు ఈ ఫార్స్ గమనిస్తూ ఉన్నారు.

అర్ధరాత్రి బస్సు కుదుపుకు ఉలిక్కిపడి లేచింది ముసలవ్వ. చుట్టూ పరికిస్తే అందరూ నిద్రలో జోగుతున్నారు. కండక్టర్ కూడా కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు.

"బాబూ! పెద్దాపురం ఇంకా ఎంత దూరం ఉంది?" అడిగింది కండక్టర్ని తట్టి లేపుతూ.

నిద్రమత్తులో విషయం మరిచిపోయిన కండక్టరు "పెద్దాపురమా? ఎప్పుడో దాటిపోయింది" అన్నాడు మత్తుగా కళ్ళు మూతలు పడుతుండటంతో.

"అయ్యో!.. కొంప ముంచావు నాయనోయ్!" అంటూ ముసలవ్వ శోకండాలు తీయసాగింది. దాంతో బస్సులోని ప్యాసింజర్స్ ఉలిక్కిపడి నిద్ర లేచారు.

"ఏమయ్యా! నీకసలు బుద్ధుందా? ఆమె ఒకటికి రెండు సార్లు అడిగితే కసురుకున్నావు. ఇప్పుడెలా? అసలే ఆమె ముసలవ్వ పైగా అర్ధరాత్రి. బస్సు వెనక్కి తిప్పాల్సిందే అంటూ పట్టు బట్టారు.

దాంతో చేసేది లేక డ్రైవర్ బస్సుని వెనక్కి తిప్పాడు.

ఓ గంట ప్రయాణం తర్వాత పెద్దాపురం బస్టాండ్ చేరింది బస్సు.

"ఇదుగో ముసలవ్వా దిగు! పెద్దాపురం వచ్చింది!" అన్నాడు కండక్టర్ డోర్ తెరుస్తూ.

"ఒక్క నిముషం ఆగు బాబూ!" అంటూ, బొడ్లోంచి ఓ కాగితం పేకెట్ తీసి, అందులోంచి ఓ టాబ్లెట్ నోట్లో వేసుకుని మరచెంబులోని నీళ్ళు త్రాగి, "ఇక పోనీయ్ బాబు!" అంది.

"అదేంటవ్వా! పెద్దాపురం వచ్చింది దిగవేంటి?" అడిగాడు కండక్టర్.

"డాక్టర్ గారు ఈ బిళ్ళ లిస్తూ ప్రతి మూడు గంటలకోసారి వేసుకోమన్నాడు. నాకు టైము తెలవదు బాబు. పైగా రాత్రి పూట ప్రయాణం అంటే, పెద్దాపురం వెళ్ళేసరికి మూడు గంటలు పడుతుంది. అప్పుడు వేసుకోమన్నాడు. అందుకనే పెద్దాపురం వచ్చిందా అని అడిగాను" అంది తాపీగా.

అంతే బస్సులోని జనాలందరూ "ఆ" అంటూ నోరెళ్ళబెట్టారు.

ఎ.ఎస్.ఎన్.గుప్త